క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



వనపర్తి రూరల్: మండలంలోని రాజపేట గ్రామానికి చెందిన బాలకిష్టయ్యకు మంజూరు అయిన రూ.60వేలు, చిన్న బాలస్వామికి రూ.28వేలు, కొండన్నకు రూ.6 వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చెక్కులు మంజూరు చేయించినందుకు కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలరాజుగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ఎల్లయ్యరాములు, తిరుపతయ్య, నాగన్న, నాగరాజు, పెంటయ్య పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన సంగనమోని రాము, కవితలకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ బుధవారం అందజేశారు. చెక్కులు మంజూరుకు కృషి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రన్నరప్‌గా వీపనగండ్ల జట్టు



వీపనగండ్ల: పానగల్ మండలంలోని చింతకుంటలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో వీపనగండ్ల జట్టు రెండో బహుమతిని గెలుచుకొన్నట్లు ఆ గ్రామంలోని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో తాడిపర్తి గ్రామ జట్టుతో తలపడిన వీపనగండ్ల రెండో బహుమతి గెలుచుకొని రూ.3,116 నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఆత్మకూర్: రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ సంతోష్, కోచ్ ఖాదర్ తెలిపారు. బుధవారం రాత్రి నారాయణపేట జిల్లా ధన్వాడలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఎంపికల్లో ఆత్మకూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, బిందుమాధవి, అమృత, సహస్ర అత్యంత ప్రతిభను కనబర్చారన్నారు. ఈ నెల 16న మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఆత్మకూర్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కొండా భూపాల్, హెచ్ఎం బాలరాజు, స్థానికులు విద్యార్థులను అభినందించారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



అమరచింత: పట్టణం నుంచి మద్దూర్ గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన బీటీ రహదారి పక్కన కేబుల్ లైన్ కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా తయారయ్యింది. రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ఆదమరిస్తే చాలు గుంతలో పడి ప్రమాదం తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. జియో ఇంటర్నెట్ లైన్ కోసం రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న కేబుల్ లైన్ మధ్యమధ్యలో ఇలా గుంతలను తవ్వి వాటిని పూడ్చకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఏర్పడుతుందో అన్న భయాందోళనలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి వాటిని పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



వనపర్తి రూరల్: గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామానికి చెందిన నాగరాజు ఈ నెల 8వ తేదీ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి, రికవరీ చేశారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి సెల్‌ఫోన్ అందజేసినట్లు ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేసినా అందని బిల్లులు
- 25 శాతం మందుస్తు బిల్లులకే పరిమితం
- ఆర్థిక ఇబ్బందులు కమిటీ సభ్యులు



వెంగళాయిపల్లి పీఎస్‌లో మూత్రశాలలు



కదిరెపాడు పీఎస్‌లో తాగునీటి కుళాయిల ఏర్పాటు

పాన్‌గల్: విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేలా వారిని ఆకర్షించేందుకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కనీస వసతుల కల్పనకు కృషి చేస్తోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా కనీస వసతులు లేని పాఠశాలలను ఎంపిక చేసి తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు మరమ్మతు తదితర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. వీటిని క్షేత్రస్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు అప్పగించారు. మండలంలో ఆయా కమిటీ సభ్యులు ఎంపిక చేసిన పాఠశాలల్లో మరమ్మతు పనులు పాఠశాలలు తెరిచే నాటికే పూర్తి చేశారు. కానీ ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తి చేసిన పనుల్లో ఇప్పటికి కేవలం 25 శాతం బిల్లులు మాత్రమే చెల్లించారు. పనులు పూర్తి చేశాం బిల్లులు చెల్లించండి అని అధికారులను అడిగితే ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా బిల్లులు చెల్లించడంలేదని వారు వాపోతున్నారు.

మండలం పరిస్థితి ఇలా..

మండలంలో 28 పాఠశాలలు ఎంపిక చేయగా.. వాటిలో పనులు పూర్తి చేసి 7 నెలలు కావస్తున్నా బిల్లులు మాత్రం మంజూరు కాకపోవడంతో అప్పులు పెరుగుతున్నాయని కమిటీ సభ్యులు వాపోతున్నారు.

బిల్లులు త్వరగా చెల్లించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేస్తే బిల్లులు వెంటనే మంజూరు అవుతాయని చెబితే అప్పులు చేసి పనులు పూర్తి చేశాం. అయినా బిల్లులు చెల్లించలేదు. 25 శాతం నిధులు మాత్రమే ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు త్వరగా మంజూరు చేయాలి.

– దిట్టెమ్మ, తెల్లరాళ్లపల్లితండా

ఆర్థికంగా ఇబ్బందులు



అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు పూర్తి చేసినా బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనులు ప్రారంభించే ముందు 25 శాతం నిధులు చెల్లించారు. బిల్లులు చెల్లించడంలో ఆలస్యం కావడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నాం. అధికారులు స్పందించి బిల్లులు త్వరగా మంజూరు చేయాలి.

– లక్ష్మి, వెంగళాయిపల్లి

త్వరలోనే బిల్లులు మంజూరు

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రెండు, మూడు రోజుల్లో బిల్లులు మంజూరు అవుతాయన్నారు. బిల్లులు చేసే క్రమంలో నాలుగు ఖాతాల్లో తప్పిదం కారణంగా బిల్లులు నిలిచిపోయాయి. తప్పులను సరిచేసి మళ్లీ పంపించాం.

– కవిరెడ్డి, ఎంఈఓ, పాన్‌గల్ మండలం

రైతుల ఇబ్బందులు తొలగించాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేతేపల్లి రైతువేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 25 రోజులు అవుతున్నా కాంటా వేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అద్దె తీసుకొచ్చారని, దీంతో అద్దె భారం పడుతుందన్నారు. వర్షం వస్తే కప్పేందుకు టార్పాలిన్ కవర్లు ఇస్తామని అధికారులు చెబుతున్నా ఈ దిశగా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు, తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయలేదని వాపోయారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం త్వరగా కాంటా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని లేదంటే రైతులతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డంగు కుర్మయ్య, అంజి, కాకం చిన్ననారాయణ, కుర్వ హన్మంతు, చిన్నకుర్మయ్య, రాముడు, నర్సింహ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

140 చెట్ల నరికివేత



వీపనగండ్ల సమీపంలో నరికివేసిన చెట్లు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో తూంకుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందనే ఉద్దేశంతో ట్రాన్స్‌కో అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న 140 చెట్లను నరికివేశారు. వరల్డ్ క్రితం గుల్మొహర్, రేన్‌ట్రీ చెట్లను నాటి దాదాపు వాటి పెరుగుదల కోసం రూ.3 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేశామని ఏపీఓ కుబేర్‌గౌడ్ అన్నారు. పంచాయతీ అధికారులను సంప్రదించి ఉంటే చెట్లు పాడవకుండా కొమ్మలను కత్తిరించే వసతి ఉండేదని ఆయన అన్నారు. ఈ విషయమై గ్రామస్తులు మాట్లాడుతూ రూ.లక్షలు ఖర్చు చేసి చెట్లను పెంచుతున్నా అధికారులు సమన్వయ లోపం వల్ల లక్ష్యం నెరవేరట్లేదని వాపోయారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పోటు చేసుకోకుండా ఉన్నతాధికారులు మండలంలోని వివిధ శాఖల అధికారులను సమన్వయపరచి అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతలు దళారులను ఆశ్రయించొద్దు



తూంకుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా మండల మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోళ్ల కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఏఎంసీ చిన్నారెడ్డి అన్నారు. బుధవారం తూంకుంటలో వరి కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు అవసరమైన వసతులను సమకూర్చామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ మాధవరావు, పలుస రాముడు, రామన్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు, రాజగోపాల్, కురుమయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల, దావాజిపల్లి, దొండాయిపల్లి, మాందాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను గురువారం డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభిస్తారని సీఈఓ భాస్కర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విండో డైరెక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం అజరామరం



వనపర్తి టౌన్: దైవ స్వరూపుడిగా, హేతువాదిగా, సంఘ సంస్కర్తగా భూమిపై నడయాడిన పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం కలియుగంలో అజరామరం అని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ అన్నారు. వీరబ్రహ్మం 416 ఆరాధనోత్సవం (జయంతి), ప్రజాకవి కాళోజీ నారాయణరావు 22వ వర్ధంతి వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్మృతి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కన్వీనర్, ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమానంలో జరిగే నిత్య సత్యాలను, కాలానుగుణంగా వచ్చే మార్పులను, ప్రజల జీవన శైలిలో తేడాలను, ప్రకృతిలో జరిగే వింతలను, విశేషాలను కాలజ్ఞానం రూపంలో ప్రతిబింబించారని వివరించారు. సర్వప్రాణులపై ప్రేమ, దయ కలిగి ఉండాలని, అంటరానితనం అమానుషమని మనుషుల మధ్య కులబేధం ఉండొద్దని వందల ఏళ్ల క్రితం కర్మసిద్ధాంతంతో వీరబ్రహ్మం చాటి చూపించారని గుర్తు చేశారు.

ప్రజల గొంతుక కాళోజీ

ప్రజల పక్షాన నిలబడి నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాన్ని ధారపోసిన మహోన్నతుడు కాళోజీ నారాయణరావు అని పేర్కొన్నారు. కాళోజీ రచించిన నా గొడవ తెలంగాణలో విప్లవాత్మక మార్పులకు మైలురాయిగా మారిందన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకులు నరసింహాచార్యులు, వెంకటస్వామి, బండలయ్య, వెంకటయ్య, చిన్నరాములు, వెంకటేశ్వర్లుశెట్టి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికే రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న చైర్‌పర్సన్

ఆత్మకూర్: రక్తదానం మహాదానమని ఆపదలో, రక్తదానం ప్రాణ ప్రాయ స్థితిలో ఉన్నవారిని కాపాడిన వారవుతారని డైరెక్టర్ గాయత్రి, ఎస్ఐ నరేందర్, ప్రిన్సిపల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్ అన్నారు. బుధవారం శ్రీస్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. 45 మంది యువకులు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. తలసేమియా రోగుల కోసం సేకరించిన రక్తాన్ని వినియోగిస్తామని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభాకర్ రావు, లింగన్న, శ్రీను, మణివర్ధన్‌రెడ్డి, వెంకటేష్, రాజేష్, అనిల్, మల్లేష్, నవీన్, డీకే ప్రకాష్, కిషోర్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు దొండాయిపల్లి, కొత్తపేట ప్రాథమిక, దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను మానిటరింగ్ టీంతో కలిసి ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, అకాడమిక్ రిజిస్టర్లు, తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతను వారు పరిశీలించారు. ప్రతి రోజు పాఠశాల హెచ్ఎంలు మధ్యాహ్న భోజనం వడ్డించే ముందు రుచి చూడాలని, ఏమైనా పొరపాట్లు జరిగితే వంట ఏజెన్సీలకు తగు సూచనలు చేయాలన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు గోవింద్, రమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి

డిసెంబర్ 4న జరిగే నిర్వహించే న్యాస్ పరీక్ష కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ హెచ్ఎంలకు సూచించారు. 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో న్యాస్ పరీక్ష కోసం తగు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్‌సీఈఆర్టీ వెబ్‌సైట్‌లో న్యాస్ పరీక్ష మాదిరి పేపర్లు అందుబాటులో ఉంటాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులచే ప్రాక్టీస్ చేయించాలని కోరారు.

వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం భూమిపూజ



ఆలయ పునర్నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న కమిటీ, గ్రామ పెద్దలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. సుమారు 400 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు కమిటీ ఏర్పాటు చేసి నూతనంగా నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఇటీవల ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించిన కమిటీ సభ్యులు పునర్నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేయడం జరిగిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి రాళ్ల కృష్ణయ్య, కోశాధికారి కొత్త యాదయ్య తెలిపారు. దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తిస్థాయిలో నాణ్యతతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే



పాంరెడ్డిపల్లిలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆత్మకూర్ మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం మండలంలోని గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి వీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాం రెడ్డి, కమిషనర్ శశిధర్ సమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి తమ కుటుంబ వివరాలను అందించాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు ప్రజలకు సూచించారు. సర్వేలో భాగంగా బుధవారం పాన్‌గల్‌లో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు పర్యటించి సర్వే వివరాలను సేకరించారు. మండలంలోని 28 జీపీల్లో 1,192 ఇళ్ల నుంచి వివరాలను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని అప్పాయిపల్లిలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం జెడ్పీ సీఈఓ యాదయ్య పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, పంచాయతీ కార్యదర్శి నర్మద పాల్గొన్నారు.

సర్వే విధులు బహిష్కరిస్తాం

పాన్‌గల్: సర్వే విధులు నిర్వహించలేమని, విధులను బహిష్కరిస్తామని కోరుకూ పాన్‌గల్ మండలం కొత్తపేటలో సర్వే విధులు నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు బుధవారం ఎంపీడీఓ గోవింద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే విధులు నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు కురుమూర్తి, నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సర్వే వివరాలు సేకరిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన కురుమూర్తి గౌడ్ మైకంలో అసభ్య పదజాలంతో దూషిస్తూ కట్టెతో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా తమ వెంట ఉన్న పారిశుధ్య కార్మికుడు రాజారెడ్డిపై దాడి చేసినట్లు వారు పేర్కొన్నారు. సర్వే విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఇలాంటి ఘటనలు పోటు చేసుకుంటున్న ప్రజలు విధులు నిర్వహించడం కష్టంగా ఉందని తమకు రక్షణ కల్పించాలని, లేనితో విధులు నిర్వహించలేమని ఎంపీడీఓకు వినతిపత్రంలో కోరినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ గోవింద్‌రావును వివరణ కోరగా.. ఎన్యుమరేటర్లు దూషించి, పారిశుధ్య కార్మికుడిపై దాడిచేసింది వాస్తవమేనని, రక్షణ కల్పిస్తేనే విధులు నిర్వహిస్తామని వారు వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు తెలిపామన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

వీధిలైట్ వెలుతురులో సర్వే..



వీధిలైట్ వెలుతురులో సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్ రాధిక

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని 3వ బ్లాక్‌లో సమగ్ర సర్వే చేపడుతున్న ఎన్యూమరేటర్ బుధవారం వీధిలైట్ల వెలుతురులో సర్వే పత్రాలను నింపారు. వార్డులోని ప్రజలు అత్యధికంగా రైతులు ఉండటంతో ఉదయం ఏడు గంటలకే వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారు. దీంతో సాయంత్రం ఆరు గంటల నుంచి ఎన్యూమరేటర్ రాధిక వీధిలో తిరుగుతూ ఇలా సర్వే వివరాలను సేకరిస్తున్నారు.

అమరచింత: సమగ్ర కుటుంబ సర్వే కోసం వస్తున్న ఎన్యూమరేటర్లకు అడిగిన సమాచారం ఇచ్చి సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. మండలంలోని కొంకనోనిపల్లి, పాంరెడ్డిపల్లిలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌ల్లో ఎన్యూమరేటర్లు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్న తీరును వారు పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అప్పాయిపల్లిలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ యాదయ్య



పాన్‌గల్‌లో..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: కుమారుని చూసేందుకు వెళ్లు గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దేరు మండలం వైశాఖపూర్ గ్రామానికి చెందిన ఎలుక మన్యం (63) కొత్తకోటలో పట్టణంలో గల తన కుమారున్ని చూసేందుకు టీవీఎస్ సూపర్ ఎక్సెల్ వాహనంపై మంగళవారం వెళ్లాడు. ఆమడబాకుల సమీపంలో ఎన్‌హెచ్44పై గుర్తుతెలియని వాహనం సూపర్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొనడం తో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజన రైతులను విడుదల చేయాలి

కొల్లాపూర్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అంటూ పౌరహక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాయి రవినాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంధువులకు పేదల భూములను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన గిరిజన రైతులను అరెస్టులు చేస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంటనే రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.